పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# 91. అష్ షమ్స్ సూరా పరిచయం

మక్కాలో అవతరించబడింది. 15 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

ఈ సూరా మక్కాలో, ప్రారంభకాలంలో అవతరించింది. మక్కాలో దైవప్రవక్త (స)పై వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉన్న కాలంలో అవతరించింది.

పాపం, పుణ్యాల తేడాను వివరించడం, ఈ తేడాను గ్రహించడానికి తిరస్కరించి పాపమార్గాన నడవగోరుతున్న వారికి జరిగే చెడు పర్యవసానాన్నుండి భయపెట్టటం ఈ సూరాలోని ప్రధాన అంశం. ఈ సూరాలో అల్లాహ్ అనంత విశ్వం అంటే సృష్టిని ఉదాహరణగా పేర్కొన్నాడు. ఇందులో సూర్యచంద్రులు, రాత్రీపగలు, భూమి ఆకాశం ప్రతిదాని రూపు రేఖలు వేర్వేరు. ఆకారాలు వేర్వేరు, ప్రతి దాని ప్రభావం వేర్వేరుగా ఉన్నాయి. లక్షలాది కోట్లాది నక్షత్రాలు తమ తమ కక్ష్యల్లో పరిభ్రమిస్తున్నాయి. ఏదీ మరొకదానితో ఢీ కొనదు. అదేవిధంగా సూర్యుడు, చంద్రుడు తమ తమ కక్ష్యల్లో తిరుగుతున్నారు. చంద్రుడు సూర్యుణ్ని అడ్డగించడం గానీ, సూర్యుడు చంద్రుని గుద్దుకోవటం గానీ జరగదు. అదేవిధంగా రాత్రి తన సమయానికి వస్తుంది. మరియు పగలు తన సమయానికి వస్తుంది. పగలు రాత్రిని రానీయకుండా ఆపడంగానీ, రాత్రి పగలును రానీయకుండా ఆపడం గానీ జరగదు. అందువల్ల సృష్టిలోని కోట్లాది ప్రాణులు ఇదేవిధంగా ఉండటం వల్ల సృష్టిలో సుఖశాంతులు నెలకొని ఉన్నాయి. అదేవిధంగా అల్లాహ్ మానవులతో అంటున్నాడు, మీరు మీ మీ హద్దులలో ఉండండి. ఒకరిపై మరొకరు జులుం చేసుకోకండి. తలబిరుసుగా వ్యవహరించకండి. మీరు గనక తలబిరుసుగా మెలిగితే ఈ సృష్టి యజమాని తలబిరుసుతనాన్ని సహించడు. ఆయన తలబిరుసు గల వారిని శిక్షిస్తాడు. సమూద్ జాతిపై ఏ విధంగా శిక్ష విధించాడో అదేవిధంగా ఓ మక్కా వాసులారా! మీరు ముహమ్మద్ (స)పైన, విశ్వాసులపైన దౌర్జన్యం చేస్తున్నారు. కాబా దైవగృహం. దైవగృహంలో దైవారాధన చేయనీయడం లేదు. ఆయన పేరును ఉన్నతం చేయడాన్నుండి నిరోధిస్తున్నారు. అల్లాహ్ స్తోత్రం చేయడాన్ని ఆపుతున్నారు. దేవుని ఏకత్వాన్ని ప్రచారం చేయనీయడం లేదు. ఓ మక్కావాసులారా! తలబిరుసుతనాన్ని మానండి. తలబిరుసుతనం చూపడం భూమిపై కల్లోలం, ఉపద్రవాలను వ్యాపింపజేయడమే. ప్రపంచ శాంతిని కబళించడమే. కనుక మక్కా వాసులారా! మీరు ఇదేవిధంగా తలబిరుసుగా వ్యవహరిస్తుంటే మీపై శిక్ష విరుచుకు పడగలదు.

## 91. అష్ షమ్స్

**ఆయత్‌లు : 15** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన
అల్లాహ్ పేరుతో

(1) సూర్యుని సాక్షిగా మరియు సూర్యకాంతి సాక్షిగా (2) చంద్రుని సాక్షి, అతడు సూర్యుని వెనక ఉదయించినప్పుడు (3) పగలు సాక్షిగా అది సూర్యుని కాంతిమంతం చేసినప్పుడు (4) రాత్రి సాక్షిగా అది సూర్యుడ్ని కప్పివేసినప్పుడు (5) ఆకాశం సాక్షిగా ఇంకా దాన్ని చేసినవాని సాక్షిగా (6) ఇంకా భూమి సాక్షిగా మరియు దాన్ని పరచిన వాని సాక్షిగా

(7) ఇంకా ఆత్మసాక్షిగా మరియు దానిని సక్రమం చేసిన వాని సాక్షిగా (8) ఇంకా అతడ్ని పాపం నుండి తప్పించుకునే మరియు పుణ్యం చేసే జ్ఞానం ఇచ్చాడు (9) దాన్ని (ఆత్మను) పవిత్రవంతం చేసినవాడు సఫలుడయ్యాడు. (10) దాన్ని అణచివేసిన వాడు విఫలుడయ్యాడు. (11) సమూద్ జాతి తలబిరుసు తనం కారణంగా ప్రవక్తను ధిక్కరించింది. (12) వారిలో నుండి ఒక పరమ దౌర్భాగ్యుడు తయారయ్యాడు. (13) దైవప్రవక్త (హజ్రత్ సాలిహ్–అ) అన్నారు, "జాగ్రత్త! అల్లాహ్ ఒంటెను నీరు త్రాగటానికి తన వంతు వచ్చినప్పుడు ఆపవద్దు. (14) కాని వారు ప్రవక్తను ధిక్కరించారు. ఒంటెను వధించారు. అందుకు దైవం వారి పాపాల కారణంగా వారి తలబిరుసుతనం కారణంగా వారిపై శిక్షను విధించి అందర్నీ నాశనం చేసి అంతం చేసేశాడు. (15) ఆయనకు వారు బదులు తీర్చుకుంటారన్న భయం ఏమాత్రం లేదు. అంటే అల్లాహ్‌కు వ్యతిరేకంగా వారి తరఫున పోరాడే వారు లేరు.

آيَاتُهَا 15 — سُوْرَةُ الشَّمْسِ 91 مَكِّيَّةٌ — رُكُوْعُهَا 1

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

وَالشَّمْسِ وَضُحٰىهَا ﴿1﴾
وَالْقَمَرِ اِذَا تَلٰىهَا ﴿2﴾
وَالنَّهَارِ اِذَا جَلّٰىهَا ﴿3﴾
وَالَّيْلِ اِذَا يَغْشٰىهَا ﴿4﴾
وَالسَّمَآءِ وَمَا بَنٰىهَا ﴿5﴾
وَالْاَرْضِ وَمَا طَحٰىهَا ﴿6﴾
وَنَفْسٍ وَّمَا سَوّٰىهَا ﴿7﴾
فَاَلْهَمَهَا فُجُوْرَهَا وَتَقْوٰىهَا ﴿8﴾
قَدْ اَفْلَحَ مَنْ زَكّٰىهَا ﴿9﴾
وَقَدْ خَابَ مَنْ دَسّٰىهَا ﴿10﴾
كَذَّبَتْ ثَمُوْدُ بِطَغْوٰىهَآ ﴿11﴾
اِذِ انْۢبَعَثَ اَشْقٰىهَا ﴿12﴾
فَقَالَ لَهُمْ رَسُوْلُ اللّٰهِ نَاقَةَ اللّٰهِ وَسُقْيٰهَا ﴿13﴾
فَكَذَّبُوْهُ فَعَقَرُوْهَا ۙ فَدَمْدَمَ عَلَيْهِمْ رَبُّهُمْ
بِذَنْۢبِهِمْ فَسَوّٰىهَا ﴿14﴾
وَلَا يَخَافُ عُقْبٰهَا ﴿15﴾ ع 1 15 16

1 – 10 వాక్యాలు

ఈ ఆయత్‌లలో సూర్యచంద్రులు, రాత్రింబగళ్ళు, భూమి, ఆకాశాలు ఏ విధంగా పరస్పరం వేర్వేరు లక్షణాలు

ఫలితాలు భిన్నంగా ఉన్నాయో అదేవిధంగా పాపం, పుణ్యం కూడ పరస్పరం భిన్నమయినవి. ఇంకా లక్షణాలు, ఫలితాలు, పర్యవసానం బట్టి వేర్వేరుగా ఉన్నాయి. కాబట్టి పుణ్యం చేసేవారు, పాపం చేసేవారు సమానులు కాలేరు. ఇద్దరిదీ ఒకే పర్యవసానం కాజాలదు. పుణ్యం చేసినవారు స్వర్గానికి పోతారు. పాపం చేసిన వారు నరకానికి పోతారు అని వివరించబడింది.

రెండో విషయం, అల్లాహ్ ప్రతి మనిషి మనో మస్తిష్కాలలో మంచి ఏదో చెడు ఏదో తెలుసుకునే జ్ఞానం ఇచ్చాడు. దొంగతనం, వ్యభిచారం, మోసం చేయడం, నమ్మక ద్రోహం, తూకాలు కొలతలలో తక్కువ చేయడం పాపకార్యాలే అని ప్రతి మనిషికీ తెలుసు. అయినా పాపం చేస్తున్నాడు. దౌర్జన్యం చేయడం, ఒకరిని బాధించడం చెడ్డపనులని ప్రతి మనిషీ ఎరుగును. అయినప్పటికీ మనిషి దౌర్జన్యం చేస్తున్నాడు. ఇతరుల్ని బాధిస్తున్నాడు. కనుక తమ ఆత్మల్ని పాపం నుండి పవిత్రంగా ఉంచుకొనేవారు, పుణ్యకార్యాలలో పాలుపంచుకునే వారు సాఫల్యం చెందుతారు.

11 - 15 వాక్యాలు

సమూద్ జాతి వారు హ(జ్రత్ సాలిహ్ (అ)ను, మీరు నిజంగానే దైవప్రవక్త అయినట్లయితే ఏదయినా నిదర్శనం చూపినట్లయితే మేము విశ్వసిస్తాము అని కోరారు. వారి కోరికపై వారు చూస్తుండగానే ఒక రాతి నుండి ఒక ఈనమోసిన ఒంటె వెలువడింది. అది మామూలు ఒంటెల కన్నా మూడు నాలుగు రెట్లు పెద్దది. అయినా ఆ జాతి వారు విశ్వాసం ప్రకటించలేదు. హ(జ్రత్ సాలిహ్ ఆ జాతి వారితో అన్నారు, "ఇది అల్లాహ్ ఒంటె. బావి నీరు ఒక రోజు ఇది త్రాగుతుంది. మరొక రోజు మీరు, మీ జంతువులు నీరు త్రాగండి." ఒప్పందం కుదిరింది. అందులో శుభం ఉంది. కాని ఆ జాతి తలబిరుసుతనం గల జాతి. వారి హృదయాలలో ఏ మాత్రం దైవభీతి లేదు. తలబిరుసుతనం గలవారు ఒక నియమానికి కట్టుబడేవారు కాదు. అందుచేత అందరూ కలిసి ఒక దౌర్భాగ్యుణ్ణి రెచ్చగొట్టి వాడిని ఒంటెను చంపమని ప్రోత్సహించారు. వారు ఆ ఒంటెను వధించారు. ఇక వారు తాము అల్లాహ్ ఒంటెను చంపినా అల్లాహ్ తమకు ఏమీ అపకారం చేయలేదని సంబరపడ్డారు. ప్రవక్త వారిని పశ్చాత్తాపపడి దైవాన్ని క్షమాపణ వేడుకోమని చెప్పగా ఆ తలబిరుసు జనం హితబోధను పెడచెవిన పెట్టారు.

దైవశిక్ష వచ్చి అందరినీ అంతం చేసింది. సమూద్ జాతి వృత్తాంతం ఇక్కడ పేర్కొనడానికి కారణం మక్కాలో కూడ ఇటువంటి పరిస్థితులే ఉన్నాయి. ఇది మక్కా ప్రజలకు హెచ్చరిక. మీరు గనక ధిక్కారవైఖరి మానకపోతే సమూద్ జాతికి పట్టిన గతే మీకు పడుతుందనీ వార్నింగ్.